## 'ప్రమాద బీమా, రుణ బీమా' ద్వారా ఇప్పటి వరకు

# రూ. 246 కోట్లు చెల్లింపు


**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రమాద బీమా, రుణ బీమా పథకాలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆర్థిక రక్షణ కవచంగా నిలుస్తున్నాయని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ప్రమాద బీమా, రుణ బీమా ద్వారా ఇప్పటి వరకు రూ. 246 కోట్లను చెల్లించామన్నారు. మహిళల కుటుంబాలకు భరోసా కల్పించడం, వారి ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీతక్క మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవిత బీమా, రుణ బీమా విధానం అమలులోనికి వచ్చిన తర్వాత బ్యాంకు రుణం తీసుకున్న మహిళ మరణిస్తే ఆ రుణాన్ని ప్రభుత్వమే చెల్లించే విధంగా వ్యవస్థను అమలు చేస్తున్నామన్నారు. ప్రమాద బీమా పథకం కింద ప్రతి మహిళా సంఘ సభ్యులకు ప్రమాద మరణం సంభవిస్తే రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి వివరించారు. బీమా పథకం అమలులోనికి వచ్చిన 2024 నుంచి ఇప్పటి వరకు 231 క్లెయిమ్స్‌ను పరిష్కరించి, మొత్తం రూ. 23.1 కోట్లను మృతుల కుటుంబాలకు అందించామన్నారు. మహిళా సంఘ సభ్యులు బ్యాంకుల వద్ద తీసుకున్న బకాయి రుణాలకు గరిష్టంగా రూ. 2లక్షల వరకు బీమా కవరేజీ కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 2,993 క్లెయిమ్స్‌ను ప్రాసెస్ చేసి మొత్తం రూ. 223.7 కోట్లను ప్రభుత్వం చెల్లించిందని వివరించారు.

## భద్రాద్రిలో వసంతోత్సవానికి అంకురార్పణ

### రామాలయంలో నేడు కల్యాణ తలంబ్రాల తయారీ

### తొలిరోజు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారీ

### మొదలైన రామయ్య పెళ్లి సందడి



**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో మంగళవారం డోలోత్సవం, వసంతోత్సవానికి శాస్త్రోక్తంగా అంకురార్పణ గావించారు. ఈ సందర్భంగా పావన గోదావరి నది నుండి తీర్థ బిందెను తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి హారతులు పట్టారు. హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రామయ్యకు డోలోత్సవం, వసంతోత్సవాన్ని ఆలయ ప్రాగణంలో నిర్వహించనున్నారు. ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. హోలీ పౌర్ణమి సందర్భంగా సహస్రధారలతో ప్రత్యేక స్నపనం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని అలంకరించి ఊయలలో ఆశీనులను చేసి డోలో త్సవాన్ని నిర్వహిస్తారు. అదే విధంగా శ్రీరామ నవమికి సంబంధించి స్వామివారి తలంబ్రాల తయారీ కూడా నేడే జరగనుంది. మొత్తం 400 క్వింటాళ్ల కళ్యాణ తలంబ్రాలు తయారీ చేయాలని నిర్ణయించగా, హోలీ పౌర్ణమి నాడు 25 క్వింటాళ్ల తలంబ్రాలు తయారు చేసేందుకు రామాలయం అధికారులు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా, ఈ నెల 19 నుండి వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామ నవమి తిరుకళ్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా మార్చి 27న శ్రీరామ నవమి, 28న పట్టాభిషేకం మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

**మొదలైన పెళ్లి సందడి :** హోలీ పౌర్ణమి సందర్భంగా తలంబ్రాల తయారీతో రామయ్య పెళ్లి పనులు మొదలవనున్నాయి. ఇప్పటికే రామాలయం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు మొదలయ్యాయి. తలంబ్రా తయారీతో ఒక్కొక్క పని మొదలు కానుండగా ఈనెల 19 నుండి తిరుకళ్యాణ మహోత్సవాలు మొదలుకానున్నాయి. ఇప్పటికే మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నవమి ఏర్పాట్లపై సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశా నిర్ధేశం చేశారు.

## పేదల ఆసరా.. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పేదల ఆసరాగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలలో దూసుకుపోతుంది. ప్రభుత్వాసుపత్రిలో జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామనారావు ల చొరవతో పేద ప్రజలకు అన్ని వైద్య సేవలు అందుతున్నట్లు ఆసుపత్రి సూపరిండెంట్ కే శ్రీధర్ తెలిపారు. వివరాల్లోకెళితే ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే స్థాయి నుండి ఇప్పుడు మేము వస్తాము సర్కార్ దవాఖానకు అని పెద్దపల్లి జిల్లా ప్రజలు వస్తున్నారు. అని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన కొన్ని రోజుల నుండి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రోజు రోజుకి వైద్య సేవలలో దూసుకుపోతుందనీ,గడిచిన ఫిబ్రవరి నెలలో నమోదు అయిన సేవల వివరాలు మొత్తం 22447 మంది ఔట్ పేషెంట్లు, ఇందులో 9758 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 660 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 4263 మంది చిన్న పిల్లల విభాగంలో, 3364 మంది గైనిక్ విభాగంలో, 410 మంది ఆర్థో విభాగంలో, 1509 మంది కంటి విభాగంలో, 675 మంది ఈ ఎన్ టి విభాగంలో, 1039 మంది చర్మ విభాగంలో మరియు 574 మంది దంత విభాగంలో వైద్య సేవలు పొందారు. అదే విధంగా 1872 మంది ఇన్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందారు, ఇందులో 849 మంది జనరల్ మెడిసిన్ విభాగంలో, 50 మంది జనరల్ సర్జరీ విభాగంలో, 433 మంది చిన్న పిల్లల విభాగంలో, 273 గైనిక్ విభాగంలో, 90 మంది ఆర్థో విభాగంలో మరియు 174 మంది కంటి విభాగంలో ఇన్ పేషెంట్ వైద్య సేవలు పొందారు.వీటితో పాటు 54 ఆర్థో శస్త్ర చికిత్సలు, 81 జనరల్ సర్జరీ శస్త్ర చికిత్సలు, 164 కంటి శస్త్ర చికిత్సలు, 25 చెవి ముక్కు & గొంతు శస్త్ర చికిత్సలు మరియు 409 డెంటల్ శస్త్ర చికిత్సలు జరిగాయని గడిచిన నెలలో మొత్తం 184 డెలివరీలు చేయగ, 27859 ల్యాబ్ టెస్టులు, 2062 అల్ట్రా సౌండ్ స్కానింగ్, 133 టిఫ్ఫా స్కానింగ్, 722 ఈ సి జి, 255 2 డి ఎకో, 1880 ఎక్స్ రే, 724 ఫిజియో థెరపీ మరియునవజాత శిశువులకు ఇప్పటి వరకు దాదాపుగా700 మంది శిశువుల కి ట్రీట్మెంట్ చెయ్యడం జరిగిందనీ, 308 ఆరోగ్య శ్రీ సేవలు అందించడం జరిగిందనీ, వీటితో పాటు ప్రత్యేకంగా 8 లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు1 యూరాలజీ శస్త్ర చికిత్స,9 రూట్ కెనాల్ శస్త్ర చికిత్సలు చేశామని తెలిపారు.

## తక్షణం సైనిక చర్యలు నిలిపివేయాలి

### హోర్ముజ్ రవాణా పునరుద్ధన ఉమ్మడి బాధ్యత : చైనా



**బీజింగ్:** పశ్చిమ ఆసియాలో తక్షణం సైనిక చర్యలను నిలిపివేయాలని చైనా విదేశీ మంత్రిత్ర శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ కోరారు. బీజింగ్‌లో రోజువారీ పత్రికాగోష్టిలో మంగళవారం ఆమె మాట్లాడుతూ పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో వెంటనే నిర్ణయం మార్చుకోవాలని, అంతర్జాతీయ రవాణాకు అంతరాయం కలిగించే చర్యలు తీసుకోవద్దని ఇరాన్‌పై చైనా ఒత్తిడి తెస్తోందని వెలువడుతున్న వార్తలపై పాత్రికేయుల ప్రశ్నకు స్పందిస్తూ, ఈ సమస్యను అందరూ కలిసి ఉమ్మడిగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. ఈ జలసంధి గుండా ఖతార్ సహజవాయువు ఎగుమతులను, ఇతర సరుకుల రవాణాలను నిలిపివేయకుండా యుద్ధాన్ని నివారించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంధన భద్రత చాలా ముఖ్యమైనదన్నారు. సహజవాయువు సరఫరాలు స్థిరంగా కొనసాగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఈ బాధ్యత అందరిమీదా ఉందన్నారు. ఇకమీదట పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగకుండా చూసుకోవాలని, హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రవాణా కార్యకలాపాలు కొనసాగేవిధంగా భరోసా సాధించాలన్నారు.

# కాళేశ్వరం కమిషన్ కరెక్టే

### హైకోర్టులో రాష్ఠం వాదన





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఏర్పాటు జిఒ 6ను సవాలు చేస్తూ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీష్‌రావు, ఐఎఎస్ స్మిత సభర్వాల్, రిటైర్డ్ ఐఎఎస్ జోషి వేసిన పిటిషన్లపై మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. ఇరుపక్షాలు వాదనలు పూర్తి చేయాలని హైకోర్టు కోరింది. ఈ నెల 5న వాదప్రతివాదులు వాదనలు పూర్తి చేయాలని ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్రానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు గతంలోని మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టేయాలంటూ మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ సిఎస్ శైలేంద్ర కుమార్ జోషి, అప్పటి సిఎం ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్ విడివిడిగా వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ కొనసాగించింది. రాష్ట్రం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల, మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవతవకలపై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు కక్షసాధింపు చర్యల్లో భాగం కాదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిపోయిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాల్లో భాగంగా బాధ్యులను గుర్తించడానికే కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. కమిషన్ విచారణ ప్రక్రియ అంతా పారదర్శకంగానే జరిగిందన్నారు. కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేయాలని కోరారు. మేడిగడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి అనువైన ప్రాంతం కాదని, తరలించాలని నిపుణుల కమిటీ సిఫారసులను పట్టించుకోలేదన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ రిజర్వాయర్ పియర్ కుంగిపోయిన నేపథ్యంలో దానిపై విచారణ చేపట్టవద్దంటే ఎలా అన్నారు. మంత్రి మండలి ఆమోదం లేకుండా నిర్మాణం చేశారన్నారు.

ప్రాజెక్టు వ్యయం 81 వేల కోట్లు అవుతుందని మొ దలుపెట్టి రూ.1.47 లక్షల కోట్లతో పూర్తి చేశారన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడిందన్నారు. విద్యుత్ సమస్య కూడా వచ్చే విధంగా చేశారన్నారు. వాదనలు ఈ నెల 5వ తేదీకి వాయిదా పడ్డాయి.

**మంత్రులు, వారి బంధువుల**

## అక్రమ క్వారీలు, భూకబ్జాలు హైడ్రాకు కనిపించడం లేదా?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదల ఇళ్లను కూల్చే హైడ్రాకు, రాష్ట్ర మంత్రులు, వారి బంధువులు చేస్తున్న అక్రమ క్వారీలు, భూకబ్జాలు ఎందుకు కనిపించడం లేదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. వెంటనే అక్రమ మైనింగ్‌లను నిలిపివేసి, దోచుకున్న సంపదను జరిమానాతో సహా వసూలు చేయాలని, అడ్డగోలు భూ కేటాయింపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒఆర్‌ఆర్‌కు ఆనుకుని ఉన్న రాజేంద్రనగర్ మండలంలోని మానసహిల్స్ ప్రాంతంలో, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన సంస్థ రాఘవ నిర్మాణ సంస్థ ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా అక్రమ క్వారీలు నిర్వహిస్తూ కొండలను పిండి చేస్తుందని, నిబంధనలకు తూట్లు పొడుస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ అక్రమ క్వారీలతో సహజ సంపదను కొల్లగొడుతుంటే రెవెన్యు, మైనింగ్, పిసిబి,హెచ్‌ఎండిఎ అధికారులు ఎందుకు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక వైపు సిఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దందా కోసం పేదల ఇండ్లు కూల్చుతున్నారని, మరోవైపు సిఎం అల్లుడి అనుయాయుల క్వారీ కోసం ఎలాంటి బిడ్డింగ్ లేకుండానే గంపగుత్తగా 17 ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా వారికి నామినేషన్ పద్ధతిలో కట్టబెడుతున్నారని ఆరోపించారు.



## కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్లివ్వాలి

### టిపిసిసి చీఫ్‌కు విజ్ఞప్తి చేసిన గ్రామీణ వైద్యులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హులైన గ్రామీణ వైద్యులకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వాలని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు గ్రామీణ వైద్యులు విజ్ఞప్తి చేశారు. మహేష్‌కుమార్ గౌడ్‌ను మంగళవారం సూర్యాపేట జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు కలిసి తమ సమస్యలపై మెమోరాండం సమర్పించారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జి.ఓ. నంబర్ 1274 జారీ చేసి గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేయాలని ప్రతిపాదించారని సంఘం నాయకులు గుర్తు చేశారు. 104, 108 అంబులెన్స్ సేవల్లో ప్రాక్టికల్స్ కూడా పూర్తి చేయించారని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన వారికి పరీక్షలు నిర్వహించి కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్లు ఇస్తామని అప్పట్లో హామీ ఇచ్చినప్పటికీ, ఆయన అకాల మరణంతో ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయిందని వాపోయారు. అందువల్ల శిక్షణ పూర్తి చేసిన గ్రామీణ వైద్యులకు వెంటనే పరీక్షలు నిర్వహించి కమ్యూనిటీ పారా మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేయాలని టిపిసిసి అధ్యక్షుడిని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ మాట్లాడుతూ, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి గ్రామీణ వైద్యుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ఎ. జ్ఞాన సుందర్, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు జెరిపోతుల లక్ష్మణ్ గౌడ్ డాంగే రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అదే అసలు కారణం.. అందుకే దాడులు : నెతన్యాహూ



**జెరూసలెం:** కొన్ని నెలలు ఆగి ఉంటే ఇరాన్ పూర్తిగా అణ్వస్త్ర సామర్థ్యాన్ని సమకూర్చుకుని ఒక శక్తిగా ఎదిగి ఉండేదని, ఇక ఆ దేశాన్ని ఆపలేకపోయేవాళ్ళమని, అందుకే దాడులు చేయాల్సి వచ్చిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నెతన్యాహూ చెప్పారు. గడచిన జూన్ నెలలో తమతోపాటు అమెరికా కూడా దాడి చేసి ఇరాన్ అణుస్థావరాలను ధ్వంసం చేశామని, కానీ ఆ తర్వాత మళ్ళీ ఇరాన్ అణు కార్యక్రమాన్ని పునఃప్రారంభించిందని, కొత్తగా భూగర్భ కేంద్రాలను నిర్మించడం ప్రారంభించిందని చెప్పారు. కొన్ని నెలలో ఇరాన్ పూర్తిగా అణుశక్తి సామర్థ్యాలు సమకూర్చుకుని మహాశక్తిగా మారి ఉండేదని, అనర్థుల దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆ దేశాన్ని అడ్డుకున్నామని చెప్పారు. ఇరాన్ దేశం ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదాన్ని ఎగుమతి చేస్తోందని డోనాల్డ్ ట్రంప్, నెతన్యాహూ మొదటినుండీ ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ మార్పిడికి కూడా ఆ దేశ ప్రజలపై ఒత్తిడి తెస్తున్నారు. కానీ ఆనాడు ట్రంప్ చేసిన ప్రకటనకు ఇప్పుడు నెతన్యాహూ చేసిన ప్రకటనకు మధ్య ఎలాంటి పొంతనా కనిపించడంలేదు. ఎందుకంటే ఇరాన్ అణు కార్యక్రమాన్ని సంపూర్ణంగా నిర్మూలించామని ఆనాడు ట్రంప్ చెప్పారు. ఇరాన్ కొత్త ప్రాంతాలలో మళ్ళీ భూగర్భ కేంద్రాలు నిర్మిస్తోందని,భూగర్భ బంకర్లను ఏర్పాటు చేస్తోందని, ఈ ప్రాంతాలలో బాలిస్టిక్ క్షిపణి తయారీ కార్యక్రమాలు నిర్వహిండానికి ఈ ఏర్పాట్లు చేసుకుంటోందని, కొద్ది నెలలు ఆగి ఉంటే అణుబాంబు కార్యక్రమానికి కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండాపోయేవని నెతన్యాహూ అన్నారు. ఒకవేళ ఇప్పుడే ఎవ్వరూ ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఉండి ఉంటే ఇక భవిష్యత్తులో ఏమీ చేయలేని దుస్థితి వచ్చి ఉండేదన్నారు. ఈ కారణంగానే తాము ఇరాన్‌పై దాడులు చేశామన్నారు. గత ఏడాది 12 రోజుల యుద్ధ దాడుల తర్వాత మళ్ళీ వారు బాలిస్టిక్ అణు కార్యక్రమాన్ని ప్రారంభించారని టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ చరిత్రాత్మకమైన విజయం సాధించిందన్నారు. లేకపోతే అనేక తరాలు సమస్యలు ఎదుర్కొనేవన్నారు. కానీ ఇరాన్ అణు కార్యక్రమాన్ని సంపూర్ణంగా నిర్మూలించామని గత ఏడాది జూన్‌లో దాడుల తర్వాత ట్రంప్ చెప్పారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనలపై విమర్శకులు, నిపుణులు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అమెరికా–ఇజ్రాయెల్ దేశబూలు ఇరాన్‌కు వ్యతిరేకంగా అంతులేని యుద్ధంలో మునిగిపోవడంలేదని ఒక ఇంటర్వ్యూలో నెతన్యాహూ చెప్పారు. ఈ ఆపరేషన్ చాలా త్వరగా ముగిసిపోతుందన్నారు. ''మీరు ఒక అంతులేని యుద్ధంలోకి వెళుతున్నారని ప్రజలు అనుకుంటున్న విషయం నాకు తెలిసింది, మేం అలా చేయడం లేదు, ఎందుకంటే ఇరాన్‌లో ఒక ఉగ్రవాద ప్రభుత్వం ఉంది, అదే దాని బలహీనత'' అన్నారు. మేం చాలా త్వరగా ఈ యుద్ధం ముగిస్తామన్నారు. తాము ఉమ్మడిగా దాడులు చేయడంవల్ల ఇరాన్‌లో ప్రభుత్వం మారిపోవడానికి వీలు కలుగుతుందన్నారు.

# భారత్ వద్ద 8 వారాలకు సరిపడ చమురు నిల్వలు

### పరిస్థితుల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

### సరఫరాకు రష్యా సంసిద్ధత



**న్యూఢిల్లీ:** భారత్ వద్ద ఆరు నుండి ఎనిమిదివారాలకు సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని అందువల్ల పశ్చిమ ఆసియాలో యుద్ధ సంక్షోభంవల్ల అప్పటివరకూ ఎలాంటి ఇబ్బందులూ ఉండవని చమురు మంత్రిత్వశాఖలో ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఐతే ఈ క్లిష్ట పరిస్థితుల్లో భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు రష్యా ముందుకు వచ్చింది. సంసిద్ధత తెలియజేసింది. ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం నాలుగోరోజుకు చేరుకున్న తరుణంలో, అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ జలసంధివైపు ఏ నౌక వచ్చినాగానీ ఆలోచించకుండా వాటిని ధ్వంసం చేస్తామని ప్రకటించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొత్త మలుపు తీసుకున్నాయి. ప్రపంచదేశాలకు ముఖ్యంగా భారత్ సహా అనేక గ్లోబల్ సౌత్ దేశాలకు అవసరమైన రోజువారీ చమురు, గ్యాస్ వనరులన్నీ ఈ జలసంధి ద్వారానే నౌకల్లో రవాణా చేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో పేరు చెప్పడానికి ఇష్టపడని చమురు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి వివరణ కొంత ఊరట కలిగించినప్పటికీ అనేక సందేహాలు వెంటాడుతున్నాయి. ట్రంప్ ప్రకటించిన ప్రకారం ఇరాన్‌తో యుద్ధం ముగిసేందుకు దాదాపు ఐదువారాలు పడుతుంది. కానీ ఈ యుద్ధం ఒకవేళ ఇంకా కొనసాగి ముందుకు వెళితే చాలా దేశాలు సమస్యల్లో పడతాయి. హోర్ముజ్ జలసంధి నుండే భారత్‌కు సగానికి సగం చమురు అవసరాలన్ని రవాణా జరుగుతాయి. తాత్కాలిక ప్రణాళిక ప్రకారం దేశంలో ఎప్పుడూ 25 రోజులపాటు ఈ నిల్వలు ఉండేవిధంగా ఏర్పాటు చేసుకుంటారు. భారీగా చమురు ధరలు పెరగడం, రవాణా ఛార్జిలు కూడా విపరీతంగా ఎక్కువగా ఉండటంవల్ల ఈ నిల్వలు పెట్టుకుంటారు. కాగా చమురు శాఖామంత్రి హర్‌దీప్ సింగ్ పురి మీడియాకు వివరణ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితులకు భారత్ సంసిద్ధంగా ఉందని, దేశానికి సరిపడినన్ని నిల్వలు ఉన్నాయని చెప్పారు. దేశంలో ముడి చమురు, సంబంధిత ఇతర ఉత్పత్తులు, కీలకమైన పెట్రోలియం ఉత్పత్తులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఐతే ఆ వివరాలు ఆయన చెప్పలేదు. ఐతే చమురు వనరుల సరఫరాలు, వ్యయాలు, పెట్రోలియం ఉత్పత్తుల నిల్వలకు సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను పరిశీలించి పర్యవేక్షించేందుకు ఇరవైనాలుగు గంటలూ కనిపెట్టుకుని ఉండేవిధంగా ఒక కం ట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. ''ప్రస్తుతానికైతే ప్రభుత్వం వద్ద చాలా సౌకర్యవంతమైన నిల్వలు ఉన్నాయి, దేశ వినియోగదారుల ప్రయోజనాలు పరిరక్షించడాని కి వీలైనన్ని నిల్వలున్నాయి, వినియోగదారులే ప్రధాన ప్రాధాన్యత, ఈ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తాం, ప్రభుత్వం చాలా ఆశాభావంతో ఉంది'' అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చూసినప్పుడు చమురును అత్యధికంగా దిగుమతి చేసుకునే అతిపెద్ద దిగుమతిదారుల జాబితాలో భారత్ మూడోస్థానంలో ఉంది. అతిపెద్ద రిఫైనరీలున్న దేశాల జాబితాలో నాలుగోస్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులను ఎగుమతి చేసే దేశాలలో భారత్ ఐదోస్థానంలో ఉంది.



టీచ్ ఫర్ చేంజ్ ట్రస్ట్ ఫౌండర్, సినీనటి మంచు లక్ష్మి, మంత్రి దనసరి అనసూయ సీతక్కను ప్రజాభవన్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 27 నిర్వహించనున్న కార్యక్రమానికి మంత్రి సీతక్కను మంచు లక్ష్మి ఆహ్వానించారు.

## ఇబ్రహీంపట్నం ఎన్నికకు లైన్‌క్లియర్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక 3 నుంచి 4 వారాల్లోగా పూర్తి చేయాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఇసి)కు హైకోర్టు ఆదేశించింది. యాదగిరి అనే వార్డు కౌన్సిలర్‌ను కిడ్నాప్ చేశారంటూ ఆయన కొడుకు వేసిన పిటిషన్‌లో హైకోర్టు.. మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్ ఎన్నికలను నిలిపివేయాలని గతంలో ఆదేశించింది. అయితే, ఈ ఆర్డర్ వెలువడే నాటికే చైర్మన్‌గా తనను ఎన్నుకున్నారని, అధికారికంగా ప్రకటించలేదని పేర్కొంటూ టి. సుదర్శన్ రెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ మంగళవారం విచారించారు. ఫిబ్రవరి 17న మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు యాదగిరి హాజరయ్యారని, ఓటింగ్‌లో కూడా పాల్గొన్నారని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. అయితే అప్పటికే యాదగిరి కుమారుడు వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ఎన్నిక నిర్వహించరాదని ఆదేశించిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ఫలితాన్ని వెల్లడించేలా ఆదేశించాలని కోరారు. దీనిపై యాదగిరి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డిలు యాదగిరిని కిడ్నాప్ చేశారన్నారు. ఏపీలోని బాపట్లకు తరలించారని చెప్పారు. బిఆర్‌ఎస్ అభ్యర్థికి యాదగిరి మద్దతు ఇవ్వలేదన్నారు. ఎస్ఇసి లాయర్ వాదిస్తూ,. ఎన్నిక నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వంఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. ఏర్పాట్లు చేయాలని లెటర్ రాసినట్లు చెప్పారు. దీనిపై న్యాయమూర్తి.. నాలుగు వారాల్లో ఎన్నిక పూర్తి చేయాలని ఆదేశించారు. పిటిషన్‌పై విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

## పిటిషన్ డిస్మిస్

**ప్రజాపక్షం / హైదరాబాద్:** మాజీ ఎంపి కెకె(కె.కేశవరావు) కుమారుడు కె.వెంకటేశ్వర్‌రావు ఫిర్యాదు ఆధారంగా బంజారా హిల్స్ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలనే వ్యాజ్యాన్ని హైకోర్టు డిస్మిస్ చేసింది. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలన్న గడీల రఘువీర్‌రెడ్డి వాదనను తిరస్కరించింది. కేకే కుమారుడు వెంకటేశ్వర్‌రావు, కూతరు, మేయర్ గద్వాల విజయలక్ష్మికి భూ క్రమబద్ధీకరణ చేస్తూ 2023, మే 23న విడుదల చేసిన జీవో నంబర్ 56ను సవాల్ చేస్తూ సిద్ధిపేట్ జిల్లా కొండపాకకు చెందిన గడీల రఘువీర్ రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిల్‌ను వాపస్ తీసుకోవాలంటే రూ. 3కోట్లు ఇవ్వాలని రెడ్డి డిమాండ్ చేశారంటూ వెంకటేశ్వర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలని రెడ్డి వేసిన పిటిషన్‌ను జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ఎకొట్టివేస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ఎఫ్ఐఆర్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తేనే నిజానిజాలు తెలుతాయని, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు.


## ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

### 5వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఈ దిగువ నుదహరించిన ఆసామీలు బ్యాంకు యొక్క **నాగోలు బ్రాంచి** నుండి బంగారు వస్తువుల హామీపై అప్పు తీసుకుని బ్యాంకు యొక్క నిబంధనల ప్రకారము సదరు అప్పును నిర్ణీత కాలములో చెల్లించనందున అనేక పర్యాయములు నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించనందునను, **నాగోలు బ్రాంచి**కి సంబంధించిన ఋణగ్రహీత యొక్క బంగారు వస్తువులు ఈ క్రింది తేదిలో వేలం వేయుట జరుగును. కావున ఆసక్తి ఉన్నవారు బహిరంగ వేలములో పాల్గొని సదరు వస్తువులను కొనుగోలు చేసుకొనవలసినదిగా కోరుచున్నాము. సదరు వేలం వేయు తేదిని మార్చుటకు గాని, రద్దు చేయుటకు గాని సంబంధిత బ్రాంచి మేనేజర్ సర్వహక్కులు కల్గియున్నారు. వేలములో వస్తువులు కొనుగోలు చేయు ఆసామీలు నిబంధనల మేరకు అమ్మకపుపన్ను కట్టవలసియున్నది. కాలపరిమితి కారణంగా వేలం అదే రోజున పూర్తికాకపోతే తాజా ప్రకటన లేకుండా అవే నియమ నిబంధనలపై తరువాత రోజులలో వేరే బ్రాంచిలలో జరిపించుటకు బ్యాంకు వారు సర్వహక్కులు కలిగివున్నారని గమనించగలరు. ఒకవేళ ఋణగ్రహీత మరణించిన పక్షములో వేలమునకు సంబంధించిన అన్ని నిబంధనలు వారి చట్టబద్ధ వారసులకు వర్తించును. ఒకవేళ ఇంతకు ముందు ఏ నోటీసు అయినను అందని యెడల ఇదే ఆఖరి నోటీసుగా భావించబడును.

**షరతులు:** వేలములో పాల్గొనదలచినవారు **రూ. 5,000/-** (అక్షరములా ఐదు వేల రూపాయలు) ధరావత్తు సొమ్ము ఈ దిగువ తెలిపిన **నాగోలు బ్రాంచి**లో చెల్లించి రశీదు పొంది వేలములో పాల్గొనవచ్చును. వేలములో వస్తువులు పాడుకొన్న వారు వేలము సొమ్ము మొత్తమును వెంటనే చెల్లించి వస్తువులను పొందవలసియున్నది. అట్లు చెల్లించని యెడల పాటదారులు తమ యొక్క ధరావత్తు సొమ్మును కోల్పోవుదురు. వస్తువుల నాణ్యతకు బ్యాంకుకు ఎటువంటి పూచీ లేదు. వేలములో పాల్గొన్నవారు వారి యొక్క పాన్ కార్డు మరియు ఫోటో ఉన్న పత్రము జెరాక్స్ కాపీ అనగా ఓటరు కార్డు / ఆధార్ కార్డు / పాస్‌పోర్ట్ ఏదైనా బ్యాంకు పాస్ పుస్తకము మొదలగునవి. దరఖాస్తుతో సమర్పించవలసియున్నది.

**బంగారు నగల వేలం ప్రకటన**

| వ. సం. | అప్పు నెం. | ఋణగ్రస్తుని పేరు | బంగారు ఆభరణాల వివరములు | మొత్తం తూకం గ్రాములలో |
|---|---|---|---|---|
| 1 | 14340 | దినేష్ సింగ్ | 1) గాజులు-4<br>2) 3 పేట్ల గొలుసు-1<br>3) ఉంగరాలు-4<br>4) 1 పేట గొలుసు లాకెట్‌తో | 110.600 |

**వేలం వేయు తేదీ: 23-03-2026 సోమవారం సాయంత్రం 4:00 గంటలకు**

**స్థలం:** నాగోలు బ్రాంచి ఆవరణలో, డోర్ నెం. 2-2-275, మొదటి అంతస్తు, భారత్ పెట్రోలియం బంక్ వెనుక, నాగోల్ 'X' రోడ్, నాగోలు, హైదరాబాద్ -68.

తేది: 04-03-2026

సం/- అధీకృత అధికారి

## సిఏలో పట్టా సాధించిన రైతుబిడ్డ



ప్రజాపక్షం/కొందుర్గు: రైతు బిడ్డ సిఏలో పట్టా సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొందుర్గు గ్రామ పంచాయతీకి చెందిన పోతురెడ్డి శౌరెడ్డి హేమలత దంపతుల కుమార్తె బాలు హర్షిత సిఏలో పట్టా సాధించింది.. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాధిస్తున్న రైతు కుటుంబంలో పుట్టిన బాలు హర్షిత సిఏలో పట్టా సాధించడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. రైతు బిడ్డ సాధించిన గొప్ప విజయాన్ని గ్రామస్తులు ప్రశంసించారు. ఈ విజయంతో గ్రామంలోని యువతకు ఆదర్శంగా ఉందన్నారు.

## గ్రామాభివృద్ధికే మొదటి ప్రాధాన్యత



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: గ్రామాభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తూ పనులు చేపట్టడం జరుగుతుందని ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ చందునాయక్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ పంచాయతీ పరిధిలోని లాల్‌సింద్ తండా నుండి మక్త (ఈద్గా) వరకు రోడ్డుకు మరమ్మత్తు పనులు చేశారు. సిసి రోడ్డుకు ఇరువైపుల మట్టి పోవడంతోపాటు మట్టి రోడ్డును చదును చేసి వినయోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే గ్రామంలో సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టామని గుర్తు చేశారు. ప్రధాన బిటి రహదారి నుండి గ్రామం వరకు సిసి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అందుకు సంబంధించిన నిధులు మంజూరైనట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సర్పంచ్ చేస్తున్న పనుల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేయడంతోపాటు అండగా ఉంటూ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నట్లు తెలిపారు.

## నాగర్‌కుంట గ్రామ పంచాయతీ కార్యాలయం మంజూరు చేయండి





ప్రజాపక్షం/షాబాద్ : నాగర్‌కుంట గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని సర్పంచ్ పాలమాకుల మల్లయ్య అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. నాగర్‌కుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించలంటే ఇబ్బందిగా మారిందన్నారు. పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో భవనంపై కప్పు పెచ్చులు ఊడి పడుతున్నట్లు తెలిపారు. కార్యాలయంలో సమావేశాలు నిర్వహించాలంటే భయంగా మారిందన్నారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డుసభ్యులకు, గ్రామస్తులకు సమావేశం నిర్వహిస్తే రావడానికి భయపడుతున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలను నిర్వహించకుండబూ పంచాయతీ కార్యాలయం బయట ఖాళీస్థలంలో నిర్వహించామన్నారు. ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయంలో మంజూరుకు ధరఖాస్తు చేసిన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పంచాయతీ భవనం మంజూరు చేయాలన్నారు.

## వృద్ధాశ్రమంలో మాజీ జెడ్‌పిటిసి విశాల శ్రావణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/కేశంపేట : వృద్ధాశ్రమంలో కేశంపేట మాజీ జెడ్‌పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎఫ్‌సిఎన్ ఫౌండేన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాండ్ర విశాల జన్మదినం పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేశారు. వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని వృద్ధులను వారిని ఆశీర్వదించారు. జన్మదినాన్ని వృద్ధాశ్రమంలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తాండ్ర విశాల అన్నారు.

## ఘనంగా హోలీ వేడుకలు



ప్రజాపక్షం/కేశంపేట : తొమ్మిదిరేకుల గ్రామంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కేశంపేల మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల సమన్వయ కమిటి సభ్యులు బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యువకులు, పెద్దలందరు ఒకే వద్దకు చేరుకొని ఒకరిపై ఒకరు రంగులు వేసుకొని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీస కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగానే హోలీ వేడుకలు నిర్వహించుకుంటారని తెలిపారు. సమాజంలో స్నేహభావం, ఐక్యత పెంపొంధించే పండుగగా హోలీ నిర్వస్తారని పేర్కొన్నారు. హోలీ పండుగ హిందూ సాంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పండుగ హోలీ అని అన్నారు. చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరు ఐక్యంగా హోలీ పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, గుత్తి శేఖర్, మురళీధర్ గౌడ్, నిరంజన్, సుభాన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పర్వతాలు, శ్రీశైలం, సత్తయ్య, మల్లేష్, హరి కిషోర్, చెన్నయ్య, రమేష్, శ్రీను, గణేష్‌లు పాల్గొన్నారు.

# 19 మంది పోలీసు అధికారుల పదవీ విరమణ

### ఘనంగా వీడ్కోలు పలికిన కమిషనర్ వి.సి.సజ్జనర్



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం సేవలందించి, పదవీ విరమణ పొందిన 19 మంది పోలీసు అధికారులకు మంగళవారం నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ ఘనంగా వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందుతున్న వారిలో నలుగురు ఎస్ఐలు, పది మంది ఎఎస్ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ముగ్గురు ఎల్‌జిఇలు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న అధికారులందరికీ తన తరపున, హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం తరపున శుభాకాంక్షలు తెలిపారు. పూర్వం ఫుట్ పెట్రోలింగ్ నుంచి ప్రస్తుత ఇన్నోవా పెట్రోలింగ్ వరకు, మారుతున్న కాలానికి అనుగుణంగా మీరు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. సుమారు 41 ఏళ్ల పాటు నిబద్ధతతో పనిచేసిన మీ లాంటి అనుభవజ్ఞులైన అధికారులు వెళ్తుండటం పోలీసు శాఖకు లోటని, అయితే ఇది సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఒక కొత్త ఆరంభమని, శేష జీవితాన్ని కుటుంబంతో కలిసి ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడపాలని కోరారు. నిత్యం ఏదో ఒక వ్యాపకంతో చురుగ్గా ఉండాలని సూచించారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూపంలో వచ్చే నగదును ప్రభుత్వ బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో భద్రపరుచుకోవాలని సూచించారు. అధిక లాభాల ఆశ చూపే మోసగాళ్ల పట్ల, ముఖ్యంగా సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పదవీ విరమణ పొందిన వారిని గౌరవప్రదంగా చూసుకోవాలని, వారి మానసిక ప్రశాంతతకు కుటుంబ సభ్యులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి కె.వెంకటలక్ష్మి, ఎఒ మహ్మద్ ఇస్మాయిల్ , పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఎన్.శంకర్ రెడ్డిలతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## గాడితప్పిన నగర పాలన

### బిజెపి ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 26 నెలలు గడుస్తున్నా, ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసీ పునరుజ్జీవం, గాంధీ సరోవర్ ప్రాజెక్టుల పేరుతో పేదలు, మధ్యతరగతి ప్రజల పట్టా భూములను అగ్గువకు లాక్కుని కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని సుభాష్ ఆరోపించారు. గతంలో అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను ఇప్పుడు కూల్చివేయడం అన్యాయమన్నారు. తెలంగాణ ప్రజలు అప్పుల బాధతో, వైద్యం అందక ఆత్మహత్యలు చేసుకుంటుంటే, కేరళ ఎన్నికల కోసం గాంధీ కుటుంబానికి రూ.1,000 కోట్లు పంపాలని సిఎం మాట్లాడటం దారుణమన్నారు. జిహెచ్ఎంసిని మూడు ముక్కలుగా విభజించడం వెనుక బిజెపిని దెబ్బతీసే కుట్ర ఉందని, పాతబస్తీని మజ్లిస్ పార్టీకి ధారాదత్తం చేయడమే కాంగ్రెస్ వ్యూహమని ఆరోపించారు. దీని వల్ల నగర పాలన పూర్తిగా గాడితప్పిందని, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతకు ముందు బిజెపి రాష్ట్ర కార్యాలయంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవ రావు, సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ సుమిరన్ పాల్గొన్నారు.

## యువత భాగస్వామ్యంతో జీవవైవిధ్య సంరక్షణ

### టిజిఎఫ్‌డిసి సీనియర్ డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ శిరీష

### బొటానికల్ గార్డెన్‌లో ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం



ప్రజాపక్షం/హైదరాబాద్ : యువత జీవవైవిధ్య సంరక్షణలో భాగస్వాములవ్వాలని టిజిఎఫ్‌డిసి సీనియర్ డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఎకోటూరిజం) కె. శిరీష పిలుపునిచ్చారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం – 2026ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శిరీష మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల వల్ల నివాస విభజన పెరిగి వన్యప్రాణి మార్గాలు ప్రమాదంలో పడుతున్నాయని తెలిపారు. 2026 థీమ్ అయిన ఔషధ, సుగంధ మొక్కలు మన ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధికి ఆధారమని, అయితే వాతావరణ మార్పులు, నివాస నష్టం వల్ల అవి ముప్పును ఎదుర్కొంటున్నాయని వివరించారు. మానవ–వన్యప్రాణి ఘర్షణలను తగ్గించాలంటే వాటి సహజ నివాసాలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది అంతర్జాతీయ థీమ్ ఔషధ మరియు సువాసన మొక్కలు – ఆరోగ్యం, వారసత్వం, జీవనోపాధి సంరక్షణను ప్రధానంగా ప్రోత్సహిస్తూ పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు నిర్వహించిన పక్షి వీక్షణ, ఫోటోగ్రఫీ పోటీలో 14 మంది వైల్డ్‌ఫ్ ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. గార్డెన్ పరిసరాల్లో మొత్తం 32 పక్షి జాతులను గుర్తించారు. పాల్గొన్నవారు తమ ఉత్తమ ఐదు ఫోటోలను అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో అప్లోడ చేశారు. జ్యూరీ నిర్ణయంతో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రదానం చేసి, అందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు. పాల్గొన్న వారికి హర్బల్ టీ, మిల్లెట్ బిస్కెట్లు అందించారు.

**విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు...**హైదరాబాద్ జియాగూడకు చెందిన సెంట్ ఆథోని హై స్కూల్, హఫీజ్‌పేట్‌లోని లిటిల్ ఫ్లవర్ బడ్స్ స్కూల్ విద్యార్థులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమాల్లో పర్యావరణ సమతుల్యంలో వన్యప్రాణుల ప్రాముఖ్యత, జీవవైవిధ్య పరిరక్షణ, మానవ–వన్యప్రాణి సహజీవనం, ఔషధ మరియు సువాసన మొక్కల ఆరోగ్య ప్రయోజనాలపై నిపుణులు వివరించారు. విద్యార్థులను గోల్ఫ్ కార్ట్ వాహనాల ద్వారా గార్డెన్‌లోని వృక్ష పరిచయ క్షేత్రం, ఔషధ తోటలు, సువాసన మొక్కల తోటలను సందర్శింపజేశారు. మొక్కల వైద్య, సాంస్కృతిక, ఆర్థిక ప్రాముఖ్యతను నిపుణులు వివరణాత్మకంగా వివరించారు.

## నకిలీ టీ, సర్ఫ్ పౌడర్, గుడ్‌నైట్ రీఫిల్స్

# విక్రయిస్తున్న ముగ్గురు అరెస్ట్




ప్రజాపక్షం/హైదరాబాద్: నకిలీ టీ పొడి, సర్ఫ్ పౌడర్, గుడ్‌నైట్ రీఫిల్స్ విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను హైదరాబాద్ సిసిఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్‌ను గోషామహల్, అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి మంగళవారం నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్ దాడులు నిర్వహించి నకిలీ రెడ్ లేబుల్, తాజ్ మహల్ టీ పొడులు, టైడ్ ఏరియల్, సర్ఫ్ ఎక్సెల్ వంటి సర్ఫ్ పౌడర్లు, అలాగే 50 ఎంఎల్ గుడ్‌నైట్ లిక్విడ రీఫిల్స్ విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అజ్మీర్‌కు చెందిన బేగంబజార్ నివాసి జయరామ్ (30), రాజస్థాన్‌కు చెందిన కుత్బుల్లాపూర్ నివాసి కచ్చవా సురేందర్(34), హనుమాన్ రామ్(21)లు నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. ఈ మేరకు దాడుల్లో 1340 రెడ్‌లేబుల్ టీ ప్యాకెట్లు, 100 తాజ్‌మహల్ ప్యాకెట్లు, 75 కిలోల లూజ్ టీ పొడి,950 టైడ్ 100 ఏరియల్, 300 వీల్, 550 సర్ఫ్ ఎక్సెల్ ప్యాకెట్లు, 3600 నకిలీ గుడ్ నైట్ లిక్విడ బాటిళ్లు (45మి.లీ), సుమారు 9500 ఖాళీ నకిలీ లేబుల్ కవర్లు పట్టుబడ్డాయ. పోలీసుల దర్యాప్తులో నిందితులు గుజరాత్ రాష్ట్రంలోని డీలర్ల వద్ద నుంచి తక్కువ నాణ్యత గల పదార్థాలు, నకిలీ ప్యాకింగ్ మెటీరియల్‌ను తక్కువ ధరలకు కొనుగోలు చేసి, గోషామహల్, అఫ్జల్‌గంజ్, బేగంబజార్ ప్రాంతాల్లోని రిటైల్, హోల్‌సేల్ వ్యాపారులకు అసలు బ్రాండ్ల పేరుతో విక్రయిస్తూ ప్రజలను మోసగిస్తున్నట్లు తేలింది. ఈ ఆపరేషన్‌ను సిసిఎస్ ఎసిపి జి.వెంకటేశ్వర రెడ్డి పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ డి.భిక్షపతి దాడులు నిర్వహించారు. నిందితులను గోషామహల్, అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్లకు అప్పగించారు. వినియోగదారులు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో క్యూ ఆర్ కోడ్‌లను తనిఖీ చేసి అసలుదనాన్ని నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు.

## మంజూరైన ఇండ్లను పేదలకు అందించాలి : మంత్రికి వినతి



ప్రజాపక్షం/ముషీరాబాద్: మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేయాలని గాంధీనగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులు కోరారు. ఈ మేరకు వారు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. దీనికి స్పందించిన మంత్రి పొన్నం ఎంపి డా.లక్ష్మణ్‌తో చర్చించి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బస్తీవాసులు ఎంబి కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

## మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ




ప్రజాపక్షం/ముషీరాబాద్: దివంగత బండారు వైష్ణవ్ జయంతి కార్యక్రమంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని పేద మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. రాంనగర్‌లో జరిగిన కార్యక్రమానికి బండారు వైష్ణవ్ ఫౌండేషన్ చైర్ పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కైలాస్ నగేష్, పూసరాజు, రమేష్ రామ్, రవిచారి, జైపాల్‌రెడ్డి, వెంకటేష్, నవీన్‌గౌడ్, మద్దూరి శివాజీ పాల్గొన్నారు.

## సేవా గుణం అలవర్చుకోవాలి




ప్రజాపక్షం/ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని మదర్ ల్యాండ్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ అలీభాయ్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అలీ భాయ్ కుమార్తె శశిధ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాంనగర్ శీను, ఎడ్ల మల్లేష్, అబ్దుల్ నవాజ్, వెంకటేష్, శ్రీను, సత్తి, సంతు, శ్రీమాన్, ఎస్.శేఖర్, కే.విశాల్, వేణు, అబ్దుల్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/సికింద్రాబాద్: పట్టాల పక్కన నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... డబిల్‌పూర్‌మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్యన మంగళవారం ఉదయం రైల్వే ట్రాక్ పక్కన నుంచి ఓ వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుడి చేతిపై అమ్మ అని పచ్చ బొట్టు ఉందని.. వయసు సుమారు 20 నుంచి 25 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

## ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం




ప్రజాపక్షం/బహదూర్‌పురా: ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని జూపార్క్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూపార్క్ క్యూరేటర్ జె.వసంత మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి 3న ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ వైల్డ్‌లైఫ్ డే'ను నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా క్లీనప్ డ్రైవ్, బర్డ్ వాక్, జంతు సంరక్షకుల టాక్ షోలు, పాములపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

### హీరోయిన్‌పై తప్పుడు పోస్టింగ్‌లు

## కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజాపక్షం/బంజారాహిల్స్: పబ్లిసిటీ కోసం హీరోయిన్‌పై తప్పుడు కామెంట్స్ చేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే... వరంగల్ జిల్లాకు చెందిన రుషిత్(24) సినిమాలు, టీవీ సీరియల్స్‌లో చిన్నాచితకా వేషాలు వేస్తుంటాడు. తన సోషల్ మీడియా వ్యూస్ పెంచుకుని తద్వారా పబ్లిసిటీ సంపాధించుకోవాలనే ఉద్దేశంతో రీల్ మాయ అనే పేరుతో బోగస్ సోషల్‌మీడియా వేదికను ఏర్పాటు చేసుకున్నాడు. సినీ హీరోయిన్ల అకౌంట్స్ ఫాలో అవుతూ ఇష్టానుసారంగా బూతు వ్యాఖ్యలను కామెంట్ రూపంలో చేస్తున్నాడు. ఈ మేరకు ఇటీవల టాలీవుడ్‌కు చెందిన ఓ హీరోయిన్, దర్శకుడిని ఉద్దేశించి అసభ్యకరమైన కామెంట్స్ చేశాడు. ఈ మేరకు బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోషల్‌మీడియా అకౌంట్ ఆధారంగా పోలీసులు రుషిత్‌ను గుర్తించారు.

## రోగుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా వైద్యసేవలు

### వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్యసేవలు అంధించేందుకు ఆసుపత్రి సిబ్బంది కృషి చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమీషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సూచించారు. మంగళవారం షాద్‌నగర్ కమ్యూనిటి ఆసుపత్రిని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వార్డులు పరిశీలించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక వైద్యులు ఎలాంటి వైద్యసేవలు అంధిస్తున్నారనే విషయాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న పోస్టుమార్టం గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమీషనర్ డాక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించేందుకు కృషి చేయాలని సూచించారు. రోగులకు వైద్య సేవలు అంధించడమే కాకుండా తగిన మందులు ఇవ్వాలని అన్నారు. రోగులకు వైద్యులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేసున్నారని వివరించారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. అధునాతన వైద్య పరికరాలతో వైద్య సేవలు అంధించేందుకు కృషి చేస్తున్నామని, ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అంధించాలన్నదే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమయవేళలు పాటిస్తూ రోగులకు వైద్యసేవలు అంధించేందుకు కృషి చేయాలని సూచించారు.




## అబ్కారీ ఆదాయానికి గండి... బ్రీజర్ షార్టేజ్ : రూ.కోట్లు నష్టం?

ప్రజాపక్షం/సిటీబ్యూరో: వేసవి నేపథ్యంలో బీర్ల అమ్మకాలు ఊపందుకుంటాయి. నచ్చిన బీరు కోసం మందుబాబులు వెతుక్కుంటారు. అయితే ఈ వేసవిలో బ్రీజర్ బీర్ల కొరతతో వాటిని సేవించే వారు ఆందోళన చెందుతున్నారు. ఆల్కహాల్ కేవలం 4.5 శాతం మాత్రమే ఉండే బ్రీజర్ బీర్లకు క్రేజీ కూడా ఎక్కువే. సాఫ్ట్‌గా ఉండే బీర్‌గా పేరొందిన బ్రీజర్‌ను యువత, మహిళలు, పోష్ కల్చర్‌లో విరివిగా సేవిస్తుంటారు. విక్రయాల్లోనూ సాధారణ బీర్లకు పోటీగానే ఉంటుంది. ఈ క్రమంలోనే గత ఏడాది డిసెంబర్ 26 నుంచి సరఫరా నిలిచిపోవడంతో బ్రీజర్ వినియోగం ప్రశ్నార్థకంగా మారింది.తయారీదారులు, ఎక్సైజ్ శాఖ మధ్య చెల్లింపు వివాదాల కారణంగా సరఫరా నిలిచిపోయిందని సమాచారం. ఏకంగా రూ.2 వేల కోట్ల పైచిలుకుగానే బిల్లులు బకాయిలు పేరుకుపోయాయని... అందుకే సంబంధిత కంపెనీలు సరఫరాను నిలిపివేసి ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారం కారణంగా ఫిబ్రవరి 2026 నాటికి స్టాక్ 7 శాతానికి పడిపోయింది. సంబంధిత రెండు కంపెనీల సరఫరా డిసెంబర్ 2025లో 1.75 లక్షల కేసుల నుంచి జనవరి 2026లో కేవలం 1,370 కేసులకు పడిపోయింది. సరఫరా నిలిచిపోవడంతో ఆబ్కారీ శాఖకు కూడా భారీగానే నష్టం వస్తుందని సమాచారం. ఇటీవల సాధారణ బీర్ల ధరలను పెంచినా.. బ్రీజర్ తరహా బీర్ల ధరలను పెంచలేదని.. దానికి తోడుగా బకాయిలతో బ్రీజర్‌కు కష్టాలు తెచ్చిపెట్టాయి. అయితే మందుబాబుల కోరిక తీరుతుందా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం ఖండన

హైదరాబాద్ : తెలంగాణలో దివ్యాంగులందరికీ ఆర్టీసీ బస్సుల్లో పూర్తిగా ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ జీవో ఇచ్చారంటూ జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చి చెప్పింది. ఇది ప్రజల్ని తప్పుదోవపట్టించేలా ఉందని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. 'దివ్యాంగులందరికీ ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ ప్రభు త్వం లేదా ఆర్టీసీ ఎలాంటి జీవో/ సర్క్యులర్ జారీ చేయలేదు. 'మహా లక్ష్మి' పథకం కింద



ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం కేవలం తెలంగాణకు చెందిన బాలికలు, అన్ని వయసుల మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు మాత్రమే వర్తిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా నడిచే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమల్లో ఉంది. ఈ పథకం కాకుండా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నట్టుగా దివ్యాంగులందరికీ ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తూ ఎలాంటి కొత్త ఉత్తర్వులూ విడుదల కాలేదు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఈ నకిలీ జీవో ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. ఇది అధికారిక ప్రకటన కాదని గమనించగలరు. ఇలాంటి నకిలీ, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం నేరం. ప్రజల్ని తప్పుదోవ పట్టించే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలందరూ కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలి'' అని విజ్ఞప్తి చేసింది.

## ప్రేమ వ్యవహారంతో యువతి ఆత్మహత్య



ప్రజాపక్షం/సంగారెడ్డి :నారాయణ ఖేడ్ గ్రామానికి చెందిన మేఘవత్ సోని బాయి (20) మియాపూర్ మక్తలోని ఫస్ట్ హెల్త్ ల్యాబ్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేస్తూ రెడ్డి ఎంక్లవ్ లో పీజి హాస్టల్‌లో ఉంటూ జీవనం కొనసాగుతుంది. ఒక సంవత్సరం నుండి ఫస్ట్ క్లినిక్ లో పనిచేస్తుంది . సోమవారం సోని పని వెళ్లకుండా హాస్టల్ గది లోనే ఉంది గదిలో తోటి స్నేహితులు ,ఉద్యాగాలకు వెళ్లారు. స్నేహితులు రాత్రి 10 గంటల సమయంలో హాస్టల్ రూమ్‌కు వచ్చి చూసేసరికి తలుపులు లోపలి నుంచి గడియ పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా ఉలుకు , పలుకు లేదు. స్నేహితులు హాస్టల్ యాజమాన్యం కిటికిలో నుండి చూడగా సోని పైకప్పు ఉక్కు కు చున్నితో ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలపులు బద్దల కొట్టి లోపలికి వెళ్లి కిందికి దించి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సహచరులు గుర్తించి వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించినప్పటికి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతి దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గత కొంతకాలంగా తన సొంత గ్రామానికి చెందిన యువకుడు ఆమె ప్రేమించుకుంటున్నారు.

## రెండు బైకులు ఢీకొని ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: సోమవారం అర్థరాత్రి దాటాకా మౌలాలి కమాన్ వద్ద ఇద్దరేసి యువకులు వస్తున్న రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వాహనాలు నడిపిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. వెనుక కూర్చొన్న వారిద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ సంఘటనలో టివిఎక్సల్ వాహనానికి మంటలంటుకోవటంతో పాక్షికంగా దగ్ధమైంది. మల్కాజిగిరి ఎస్సై గణేష్ బాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈసిఐఎల్‌లోని హ్యుందాయ్ షోరూంలో స్టోర్ ఇన్‌చార్జిగా పనిచేసే రాంనగర్ నివాసి దేశ్వక్ శ్రేయంత్ (23) తన స్నేహితుడితో కల్సి సోమవారం అర్థరాత్రి దాటాకా 1.30 గంటల సమయంలో తన కెటిఎం బైకు (టిఎస్05 ఎఫ్ఎల్1349)పై వెళుతున్నాడు. అదే సమయంలో దమ్మాయిగూడ సాయిబాబానగర్ ప్రాంతానికి చెందిన రుషికేష్ (15)తో స్నేహితుడితో కల్సి టివిఎస్ ఎక్సల్ (ఎపి 10పి 7401)పై హలీమ్ తినేందుకు మౌలాలి ప్రాంతానికి వచ్చాడు. మౌలాలి కమాన్ సమీపంలోని నూర్ హైస్కూల్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు వేగంగా పరస్పరం ఢీకొన్నాయి. దీంతో కెటిఎం బైకు నడిపిస్తున్న శ్రేయంత్ తీవ్ర గాయాలతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. టివిఎస్ ఎక్సెల్ వాహనం నడిపిస్తున్న రుషికేష్ తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బైకుల వెనుక కూర్చొన్న వారిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో టివిఎస్ ఎక్సెల్ వాహనానికి మంటలంటుకొని పాక్షికంగా దగ్ధమైంది. ప్రమాద విషయాన్నిచూసిన స్థానికులు వాహనానికి అంటుకొన్న మంటలను చల్లార్చారు. ఈ ప్రమాదానికి కారణం బైకులపై ప్రయాణిస్తున్న వారంతా మద్యం మత్తులో ఉన్నట్లు అనుమానిస్తున్నారు.

## గల్ఫ్‌యుద్ధం నేపథ్యంలో

# ప్రతి కుటుంబంపై రూ.2,000 భారం?

* అదనంగా సర్‌చార్జీల మోత తోడయ్యేనా?
* కేంద్ర, రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ తగ్గిస్తే భారం తగ్గొచ్చు




ప్రజాపక్షం/సిటీబ్యూరో: గల్ఫ్‌యుద్ధ ం కారణంగా ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ప్రజలు దుబారా ఖర్చులను కూడా తగ్గించుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సహజంగానే క్రూడ్ ఆయిల్, పెట్రో ఉత్పత్తులపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగనున్న నేపథ్యంలో రవాణా రంగంపై భారం పడుతుంది. రవాణా రంగంపై అదనపు భారం పడితే నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఈ క్రమంలోనే ప్రతి కుటుంబంపై అదనంగా రూ.1,500 నుంచి రూ.2,000 వరకు భారం పడే అవకాశాలున్నా యి.

యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాల నుంచి క్రూడ్ అయిల్, పెట్రో ఉత్పత్తుల సరఫరా సంక్లిష్టంగా మారుతుంది. సరఫరా పరిస్థితి అయోమయానికి గురవుతుంది. అనుకున్న సమయానికి సరుకులు చేరవు. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా సరుకుల సరఫరా జరగదు. ఫలితంగా డిమాండ్ పెరుగుతుంది. ఈ క్రమంలోనే ధరలు పెంచి వస్తువులను విక్రయిస్తారు. మధ్య దళారీలు ఈ అవకాశాన్ని సొమ్ముచేసుకుంటారు. ధరలు పెరగడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆచితూచి కొనుగోళ్లు చేయాల్సి ఉంటుంది. పెరిగిన డిమాండ్.. తగ్గిన సరఫరా కారణంగా కొనుగోలు చేసే స్తోమత ఉన్న వారికి ఇబ్బంది లేకున్న.. రోజువారీ ఆదాయంపై ఆధారపడేవారు.. చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్న వారు మాత్రం విక్రయాల గురించి ఆలోచించాల్సి వస్తుంది. వారికి ఇబ్బందులు తప్పవు.

ఇప్పటికిప్పుడు సరఫరాపై ఆందోళన లేకున్నా.. రానున్న రోజులను దృష్టిలో ఉంచుకుని హోల్‌సేలర్స్ అప్పు డే కృత్రిమ కొరతను సృష్టించే అవకాశాలు లేకపోలేదు. రానున్న రోజుల్లో క్రూడ్ ఆయిల్ ధర బ్యారల్‌కు 7 శాతం నుంచి 15 శాతం పెరిగే అవకాశాలున్నయని.. ఇదే పరిస్థితి కొనసాగితే భారం 100 యూ ఎస్ డాలర్లకు చేరినా ఆశ్చ ర్యం లేదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

**అదనపు భారం...** వేతన జీవులు, రోజువారీ ఉపాధి పొందే వారు ఆర్థిక భారం మోయక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ నగరంలో జీవన వ్యయం పెరుగుతుంది. ముఖ్యంగా భారత దేశం వంటి దిగుమతి ఆధారిత దేశాల్లో ప్రతి కుటుంబంపై అదనపు భారం తప్పదు. సొంత వాహనాల ఇంధన ఖర్చు, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల రవాణా ఖర్చు, బస్సు, ఆటో, క్యాబ్ ఛార్జీల పెరుగుదల, గ్యాస్ సిలిండర్, విద్యుత్, ఇతర వస్తువుల ధరలపై ప్రభావం చూపుతుంది.

మొత్తం అంచనా భారం సాధారణ, మధ్యతరగతి ప్రతి కుటుంబానికి నెలకు సుమారు రూ.2,000 వరకు అదనపు ఖర్చు పెరిగే అవకాశం ఉంటుంది. ధరల పెరుగుదల స్థాయి, ప్రభుత్వ పన్ను నిర్ణయాలపై ఆధారపడి ఉన్నా.. ఆర్థిక మాంద్యం తట్టుకునేందుకు అదనపు సెస్ విధిస్తే భారం భరించాల్సిందే.

అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్సైజ్ డ్యూటీ తగ్గిస్తే భారం తగ్గొచ్చు. యుద్ధం తాత్కాలికంగా ఉంటే ప్రభావం కూడా తాత్కాలికమే. ఎక్కువకాలం కొనసాగితే ద్రవ్యోల్బణం పెరిగి మరింత భారం పడుతుంది.

## నల్ల చెరువుకు పూర్వ వైభవం..




ప్రజాపక్షం/కూకట్‌పల్లి : కూకట్‌పల్లి గ్రామానికి ప్రసిద్ధి చెందిన నల్ల చెరువు పునరుద్ధరణతో ప్రాంతీయ ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఒకప్పుడు గ్రామానికి తాగునీరు అందించడంతో పాటు వ్యవసాయానికి, పాడిపంటలకు జీవనాధారంగా నిలిచిన ఈ చెరువు గత దశాబ్ద కాలంగా మురుగునీరు, డ్రైనేజీ, బురద, చెత్తతో నిండిపోయి దయనీయ స్థితికి చేరింది. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు, మరుగున పడిన నీటి వనరులను శుద్ధిచేసి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యల్లో భాగంగా హైడ్రా ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నల్ల చెరువును పూర్తిగా శుద్ధిచేసి పూర్వ వైభవం తీసుకువచ్చారు.

చెరువు చుట్టూ పార్క్, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బండి రమేష్ మంగళవారం వ్యాయమం, వాకింగ్ కోసం చెరువు వద్దకు వచ్చిన స్థానికులతో మాట్లాడారు. స్థానికులు తమ ఆనందాన్ని వ్యక్తంచేస్తూ, గతంలో ఎప్పుడూలేని విధంగా ప్రభుత్వం పాలనా సంస్కరణలు తీసుకువచ్చిందని, పర్యావరణ పరిరక్షణలో కీలక అడుగులు వేస్తోందని పేర్కొన్నారు.

నల్ల చెరువును ఇంత అందంగా తీర్చిదిద్దుతారని ఊహించలేదని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మేలుచేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని బండి రమేష్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబర్స్, ఆలయ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, మైనార్టీ నాయకులు, ఎస్‌సి సెల్ నాయకులు, బిసి సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

ప్రజాపక్షం /కోట్‌పల్లి: వికారాబాద్ నయోజకవర్గంలోని కోట్‌పల్లి మండలానికి సంబంధించిన 14కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి పెళ్ళి చేసిన తల్లిదండ్రులకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వృథా చేసుకోకుండా అవసరాలకోసం డబ్బు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింగ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభు, తదితరులు పాల్గొన్నారు.



## ఎంబిఎస్ఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లి: ఎంబిబిఎస్ విద్యార్థుల చదువుకోసం ఫీజులు చెల్లించడం అభినందనీయమని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఎంబిబిఎస్‌విద్యార్థులు ఏడుగురికి హరీష్‌రావు నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బిఎల్ఆర్ ట్రస్టు ద్వారా చెక్కులు అందించారు. విద్యా సంవత్సరంలో 122 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయడం, వెనుకబడిన వర్గాల నుండి వచ్చే ప్రతిభావంతమైన యువతను ప్రోత్సహిస్తూ విద్య ద్వారా సాధికారత కల్పించడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభు దాస్, నాయకులు వంజరి ప్రవీణ్‌కరిపే, మహేష్‌గౌడ్, ప్రవీణ్‌ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య

ప్రజాపక్షం/పరిగి:మున్సిపల్ పరిధిలోని ముదిరాజ్ స్మశాన వాటికలో మర్రిచెట్టుకు ఉరివేసుకొని అత్మహత్యకు పాల్పడాడు ఓ యువకుడు. పరిగి పట్టణంలో డైలీ కూలీగా పని చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. మానసిక ఒత్తిడులతో మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు పలువురు అనుమానిస్తున్నారు. మృతుడు కాట్రావత్ దీపక్ దోమ మండల పరిధిలోని మైలారం గ్రామం పాశం తాండకు చెందినట్లు స్థానికులు గుర్తించారు.

స్థానికులు అత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేసి మరీ చెట్టుకు వేలాడదీశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఘనంగా హోలీ సంబురాలు



ప్రజాపక్షం/దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలోని పద్మనగర్ ఫేజ్ 2, రోడ్ నెంబర్ 22లోని వాగ్దేవి రెసిడెన్సి అపార్ట్మెంట్ లో చిన్నారులు హోలీ సంబరాలు చేసుకున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఆడి పాడారు చిన్నారుల కేరింతల మధ్య హోలీ పండుగ జరుపుకున్నారు.

**నవాబుపేట్‌లో** : నవాబుపేట్ మండలంలో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద, ఆడపడుచులు కలిసి రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో హోలీ పండుగలో జరుపుకున్నారు. హోలీ పండుగ అంటేనే చిన్నారులకు ఎనలేని ఆనందం చెందుతారు. అలాంటి హోలీ పండుగ రోజు చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామాలలో రంగులు వేసుకుంటూ హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు మోదుగ పువ్వుతో తయారుచేసిన రంగులను ఒకరికి ఒకరు చల్లుకుంటూ ఆనందంగా హోలీ జరుపుకున్నారు. హోలీ పండుగను అందరూ ఆనందంగా సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు, నాయకులు, యువకులు, మహిళలు, చిన్నారులు, తదితరులు ఉన్నారు.




**రంగులు పంపిణీ చేసిన కొలుకుల జైహింద్**

**కుత్బుల్లాపూర్‌లో:** హోలీ పండుగను పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కొలుకుల జైహింద్ మంగళవారం మగ్ధుంనగర్‌లోని కార్యాలయం వద్ద స్థానిక చిన్నారులకు ఉచితంగా రంగు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా హోలీ వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. విషపూరితమైన రసాయనాలను వాడకుండా సాధారణ రంగులను మాత్రమే చల్లుకొని ఆరోగ్యకరంగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శేషారెడ్డి, రాయి విగ్నేష్, సాయిలు యాదవ్, సునీల్‌రెడ్డి, మైలారం రాజు, కొలుకుల కార్తిక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



**పరిగిలో:** మున్సిపల్‌లోనీ టీచర్స్ కాలనీలో హోలీ పండుగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు రంగులు వేసుకొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. చిన్న పెద్ద యువత తేడా లేకుండా అందరు హోలీ కేరింతలతో హోలీ సంబరాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ హోలీ సంబరం తర్వాత చెడుపై మంచి సాధించిన ఈ హోలీ పండుగ సంబరాలు జరుపుకుంటారన్నారు. సోదర భావంతో ఎవరి మధ్య ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరూ హోలీ పండుగ సంబరాలు జరుకున్నారు.



**హోలీవేడుకల్లో పాల్గొన్న ఎస్‌పి స్నేహమెహ్రా**

**వికారాబాద్‌లో:** హోలీ పండుగను పురస్కరించుకుని జిల్లా ఎస్‌పి కార్యాలయం లో రంగుల వేడుకలు అత్యంత ఉత్సహంగా, వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా తమ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు, పోలీస్ అధికారులందరికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగ అయిన హోలీ ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగును, ఆనందాన్ని నింపాలన్నారు. జిల్లాలో పని చేసే ప్రతి ఒక్కరు ఒకే కుటుంబ సభ్యులని నిరంతరం విధుల్లో నిమగ్నమై ఉండే సిబ్బందికి ఇటువంటి వేడుకలు ఉల్లాసాన్ని కలిగించి పరస్పర ఐఖ్యతను పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వీరేష్,తదితరులు పాల్గొన్నారు

**హోలీ సంబరాలో పట్టణ అధ్యక్షురాలు శిరీష**

మున్సిపల్‌లోని గాంధీ క్యాబిపి పి1కాలనిలో బిజేపి పట్టణ అధ్యక్షురాలు శిరిష పాల్గోని మాట్లాడుతూ, కాలనీ వాసులకు హోలి శుభాకాంక్షలు తెలిపి, రంగు రంగులతో ఒకరికొకరు చల్లుకున్నారు. ఈ హోలీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, తదితరులు పాల్గొన్నారు.





## ఎంపి నిధుల నుండి హైమాస్ట్ లైట్స్ మంజూరు



ప్రజాపక్షం/నర్వ : నర్వ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలలో భాగంగా బిజెపి తరఫున గెలిచిన గ్రామాలకు ఎంపి నిధుల నుండి హైమాస్ట్ లైట్స్, సిసి రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని ఆమె ఇచ్చిన మాట ప్రకారంగా, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి కృషితో నర్వ మండలంలో బిజెపి తరఫున సర్పంచ్‌గా గెలిచిన లంకాల్, ఎల్లంపల్లి, యాంకి, లక్కరదొడ్డి, ఉండేకోడ్ గ్రామాలకు మొదటివిడతగా మంగళవారం హైమాస్ట్ లైట్స్ వేయడానికి పంపిస్తున్న మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె.అరుణకు నర్వ మండల గ్రామాల ప్రజల తరఫున నర్వ మండల బిజెపి అధ్యక్షుడు టి.అజిత్ సింహారెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



## శ్మశానవాటికలో బోర్ మోటార్ ఎత్తుకెళ్లిన దుండగులు

ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీపంలోని స్మశాన వాటికలో ఉన్న బోరు మోటార్ చోరీకి గురి అయింది. గ్రామస్తుల అవసరాల కోసం ఊరు చివర ఉన్న స్మశాన వాటిక దగ్గర కొద్ది రోజుల క్రితం బోరు వేయించి మోటార్ బిగించారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బోరులో ఉన్న మోటార్నీ ఎత్తుకెళ్లారు. దొంగిలించిన మోటార్ విలువ దాదాపు రూ.50 వేలు ఉంటుందని సర్పంచు సూర్య కుమార్ తెలిపారు. మక్తల్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి కొత్తగా ఎన్నికైన సర్పంచు సూర్యకుమార్ తెలిపారు. మక్తల్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి కొత్తగా ఎన్నికైన సర్పంచు గ్రామ అవసరాల కోసం స్మశానికి కొద్ది దూరంలో గ్రౌండ్ వాటర్ సమృద్ధిగా ఉండటంలో గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో బోరుకు డ్రిల్ వేయించారు. దాదాపు రెండున్నర ఇంచుల నీళ్లు రావడంతో కరెంటు మోటార్ బిగించారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్, స్టార్టర్, కేబుల్ వైర్‌ను దొంగిలించారు. ఉదయం మోటార్ ని స్టార్ట్ చేద్దామని వెళ్లి చూడగా ఖాళీ కేసింగ్ పైపు మాత్రమే కనిపించడంతో అవ్వకయ్యారు. గ్రామ ప్రజల నీటి అవసరాల నిమిత్తం వేసిన బోరును దొంగిలించడంపై గ్రామస్తులు ఆశ్యర్యపోయారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన సర్పంచు సూర్యకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



## మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాతృమూర్తి మృతి

### నివాళ్ళులు అర్పించిన ఎమ్మెల్యే, పలువురు నేతలు


ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ (90) మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎద్మ సత్యం, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్‌లు తలకొండపల్లి మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను పరామర్శించి, అమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి మనోధైర్యంతో ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిఆర్‌ఎస్ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## కారు ఢీకొని ఉప్పరి కేశవులు మృతి

### భార్య వనజకు తీవ్ర గాయాలు , హైదరాబాద్‌లో చికిత్స

### బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భరోసా

ప్రజాపక్షం/ఏదుల : ఏదుల మండలం, చీర్కపల్లి గ్రామానికి చెందిన ఉప్పరి కేశవులు(52) ఆయన భార్య వనజ బైక్‌పై వెళుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కేశవులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భార్య వనజకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను వెంటనే హైదరాబాదులోని మీనాక్షి హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ పగుడాల రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుఖేందర్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జమ్మి మల్లేష్, వెంటనే వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే హైదరాబాద్ చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వనజను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమె ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తక్షణ ఆర్థిక సాయం గ్రామ సర్పంచ్ పగుడాల రవి సమక్షంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000 నగదు అందజేశారు. కేశవుల మరణం కుటుంబానికి తీరని లోటని, భవిష్యత్తులో కూడా తమవంతు సహాయం కొనసాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డిగోపుల పరుశురాములు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జమ్మి మల్లేష్‌యాదవ్, గ్రామ పెద్దలు, వెంకటేశ్వర్ రెడ్డి, గడ్డమీది రాములు, ఉప్పరి యాదయ్య, ఉప్పరి శివ, పి.సురేష్, ఉప్పరి మల్లేష్ తదితరులు ఉన్నారు.



# షీటీమ్స్‌తో మహిళలు, బాలికలకు భద్రత

### ఎస్పీ డి.జానకి





ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాలో మహిళలు, బాలికలు, విద్యార్థినులకు సంపూర్ణ భద్రత కల్పించేందుకు షీటీమ్స్ బృందాలు నిరంతరం కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ డి.జానకి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థలు, బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రదేశాలలో షీ టీమ్స్ సిబ్బంది సివిల్ డ్రస్‌లో నిత్యం నిఘా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలో జిల్లాలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరిలపై కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం 20 ఫిర్యాదులు అందగా, అందులో 4 కేసుల్లో కౌన్సిలింగ్ నిర్వహించగా, 14 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, చర్యలు తీసుకున్నామని, 2 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతో పాటు 6ఈ పెట్టి కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 12 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలోని 70 హాట్ స్పాట్ ప్రాంతాలను సందర్శించి నిఘా నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూళ్లు, రెసిడెన్సియల్ పాఠశాలలు, కెజిబివి పాఠశాలల్లో షీటీమ్స్ బృందాలు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ తదితర అంశాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. బాలికలు, విద్యార్థినులు తమపై ఎలాంటి వేధింపులు జరిగినా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీటీమ్స్ ఏర్పాటు చేయబడిందని, మహిళలు మరియు బాలికల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎవరైనా రోడ్డు పై అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశ్యపూర్వకంగా వెంబడించినా, వేధింపులకు పాల్పడినా వెంటనే డయల్ 100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు : 5 మంది ఆటో డ్రైవర్లకు జైలు శిక్ష**

ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టౌన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించబడినవి. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడిపిన 6 మందిని పట్టుకుని, మంగళవారం సెకండ్ క్లాస్ కోర్టు గౌరవ న్యాయమూర్తి ఆర్.శశిధర్ ఎదుట హాజరు పరచగా, విచారణ అనంతరం ఒక ద్విచక్ర వాహనదారునికి రూ.1000 జరిమానా విధించగా, మద్యం సేవించి ప్రయాణికుల ఆటోలు నడిపిన 5 మంది డ్రైవర్లకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించబడింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగి నడపరాదని ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ముఖ్యంగా ప్రయాణికులను తీసుకెళ్తున్న ప్యాసింజర్ ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో వాహనాలు నడపడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య. ఇటువంటి వారిపై కఠిన చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయి. ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. జిల్లా ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని పోలీసు శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## మార్చురిలో శవాన్ని కుక్క పీక్కుతిన్న ఘటనపై ప్రభుత్వం సీరియస్

### అమానవీయ ఘటనపై విచారణకు ఆదేశం

### బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



తక్షణం విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఒక శవాన్ని కుక్క పీక్కుతిన్న ఘటనపై జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సీరియస్‌గా స్పందించిన నైపథ్యంలో ఈ సంఘటనపై విచారణ చేయడానికి రాష్ట్ర వైద్య విధానపరిషత్ కమిషనర్ డా.జె.అజయ్‌కుమార్ నేడు విచారణకు రానున్నారు. మానవత్వానికి మాయనిమచ్చగా మిగిలిన ఈ సంఘటపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అజయ్ విచారణ చేయడానికి మంగళవారం జడ్చర్లకు వస్తున్నారు. ఈ సంఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మరోసారి ఇలాంటి అమానవీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

## మేరా యువభారత్ సంఘం ఏర్పాటు

ప్రజాపక్షం/కొత్తపల్లి : మండల పరిధిలోని భూనీడ్ గ్రామంలో గ్రామస్తులు మంగళవారం రోజు మేరా యువభారత్ సంఘం ఏర్పాటు చేశారు. ఈ సంధర్బంగా అధ్యక్షుడిగా ఎన్నికైనా బాలకిష్టయ్య మాట్లడుతూ అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ సమాజసేవా కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేయడానికి ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో యువజన సంఘలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భూనీడ్ యువజన సంఘం కమిటి ఉపాధ్యక్షుడిగా నడ్డిరాజు,ప్రధాన కార్యదర్శిగా సవారి కోండప్ప,కోశాధికారిగా వేణుగోపాల్,సభ్యులుగా క్రాంతికుమార్, అజయ్, రమేష్, అశోక్, రవికుమార్,హన్మంతు,శ్రీను తదితరులను ఎన్నుకున్నారు.

## బస్టాప్ ఏర్పాటు చేయండి

ప్రజాపక్షం/మద్దూర్ : పట్టణ కేంద్రంలోని అమర్‌గడ్డ కాలనీ సినిమా టాకిస్ దగ్గర రెండు రోడ్ల కూడలి నుండి నిత్యం ప్రతి రోజు నిడ్జింత, కొత్తపల్లి, కోయిల్‌కొండ, మహబుబ్‌నగర్, గుండుమాల్, కొస్గి, కొడంగల్, పరిగి, హైదారాబాద్‌లకు ప్రధాన రహదారిగుండా రోజు ప్రజలు తమ అవసరాల నిమిత్తం ప్రయాణాలు చేస్తుంటారు. ఇంతకు ముందు ప్రభుత్వం ఏర్పాడక ముందు సినిమా టాకిస్ చౌరస్తా నుండి పోలీస్ స్టేషన్ వరకు ఎక్కడైనా చెయ్యెత్తితే బస్సులు ఆపేవారు కానీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మహాలక్ష్మ పథకం పుణ్యమా అని ప్రారంభం అయినప్పటి నుండి ఎక్కడ కూడా ఆపట్లేదు. ఆపినా, చెయ్యెత్తినా 100 మీటర్ల వరకు వెళ్లాల్సిందే. న్యూ బస్టాండ్‌కి వెళ్లాలంటే 2 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని, బస్సులు ఇక్కడ ఆపట్లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్ లేకపోవడంతో ప్రజలు రోడ్డుపైనే బస్సుకోసం ఎదురుచూడాలి. ఇక్కడ పోలీస్ స్టేషన్ నుండి సినిమా టాకీస్ వరకు ఎక్కడైనా బస్టాప్ ఏర్పాటే చేయాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా ఆర్టీసి అధికారులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మెన్, కౌన్సిలర్ మా ప్రయాణ ఇబ్బందిని అర్థం చేసుకొని బస్టాప్ ఏర్పాటు చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాపక్షం/ నారాయణపేట : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎఐసిసి అధినేత రాహుల్ గాంధీ నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డికి సూచించారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి పర్యాటక ప్రాంతంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్షులతో సంఘటన సృజన్ అభియాన్ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఐసిసి అధినేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పార్టీ బలోపేతం ఇతర అంశాల పై దిశా నిర్దేశం చేసినట్లు డిసిసి అధ్యక్షులు పై దిశా నిర్దేశం చేసినట్లు డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, ముద్ర ప్రతినిధికి ఫోన్ ద్వారా తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించి పార్టీని మరింత పటిష్టం చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అలాగే డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ కొంత సేపు మాటా మంతి నిర్వహించారు.

## అంబేద్కర్ అశయాలను కొనసాగిద్దాం

### తలారి వెంకటేష్

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి: మహాత్మ జ్యోతిరావుపూలేడాక్టర్ బిఆర్ అంబేద్కర్ అశయాలను కొనసాగిద్దామని పూలే అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు తలారి వెంకటేష్ అన్నారు. కల్వకోలు గ్రామంలో పూలే అంబేద్కర్ యువజన సంఘం సమావేశాన్ని వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు.డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఏర్పాటు, పూలేఅంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 5 లేదా 6 తేదిలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, తాత్కలికంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని,నూతన విగ్రహ ఏర్పాటు వరకు పూలే అంబేద్కర్ యువజన సంఘం పాత కమిటీ కొనసాగుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ బంట్రోత్ శ్రీనివాసులు,మాజీ డిప్యూటి సర్పంచ్ వెంకటస్వామి, అంబేద్కర్ వారసులు నూనె క్రాంతి కుమార్.సంగం కుమార్,సంగం కృష్ణ,సంగం మద్దిలేటి,జక్కుల వెంకటమ్మ,రూన సుధాకర్,తలారి రాజశేఖర్,సంగం శంకరయ్య,బంట్రోత్ శశికళ,బంట్రోత్ కళావతి తదితరులు పాల్గొన్నారు.





## రూ.3 కోట్ల నిధులతో 7వ వార్డులో సిసి రోడ్డు డ్రైనేజీ పనులు ప్రారంభం

### మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో అభివృద్ధి పనులు

ప్రజాపక్షం/మక్తల్ : మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాలతో దాదాపు రూ. 3 కోట్ల నిధులో గుర్లపల్లికి వెళ్లే రహదారి సిసి రోడ్డు డ్రైనేజీ పనులను స్థానిక వార్డు కౌన్సిలర్ విద్య నీల గౌడ్, ప్రారంభించగా.. మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్ శ్రీవిద్య నీల గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి నేతృత్వంలో మక్తల్ పట్టణంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే పలుచోట్ల సిసి రోడ్లు, డ్రైనేజీల పనులు ప్రారంభం కాగా... తాజాగా 7వ వార్డులో 3 కోట్ల రూపాయల నిధులతో గూర్లపల్లికి వెళ్ళే రహదారికి సిసి రోడ్డు డ్రైనేజీ పనులను ప్రారంభించామని అన్నారు. వార్డు కౌన్సిలర్ గా గెలిచిన వెంటనే 7వ వార్డులో సిసి రోడ్ల పనులు సైతం ప్రారంభించామని అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో 7వార్డు తోపాటు మక్తల్ మున్సిపాలిటీ, నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకుందామని, ప్రతి ఒక్కరూ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి కి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడబ్ల్యు ఈ నాగ శివ, వర్క్ ఇన్స్పెక్టర్ సత్యం గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు శంషుద్దీన్, మందుల నరేందర్, కట్ట వెంకటేష్, ఎండి రఫీ, ఎండి పాషా, యునూస్, నవీద్ పాషా, సునీల్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వసంత కేళి రంగుల హోలీ



**అంబరాన్నంటిన హోలీ సంబరాలు**
**రంగుల కేరింతలతో పులకించిన అమరవాయి**



ప్రజాపక్షం/గద్వాల్/మల్దకల్ : వసంత కాలపు రాకను చాటిచెప్పే రంగుల పండుగ ' హోలీ'ని జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని డి.అమరవాయి గ్రామంలో మంగళవారం అత్యంత ఘనంగా, వైభవంగా జరుపుకున్నారు. ''హోలీ.. హోలీల రంగ హోలీ.. చమ్మకేలిలా హోలీ'' అంటూ యువత పాటలతో గ్రామంలోని వీధులన్నీ మారుమోగిపోయాయి. కులమతాలకు అతీతంగా, అబాలగోపాలం ఈ వేడుకల్లో పాల్గొని సోదరభావాన్ని చాటుకున్నారు. శాస్త్రోక్తంగా హోలీ వేడుకలకు ముందుగా సోమవారం అర్థ రాత్రి మండల వ్యాప్తంగా కామదహన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. అమరవాయి గ్రామంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు, చిన్నారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం వేళ ఇంటింటికీ తిరిగి కామదహనానికి అవసరమైన వస్తువులను సేకరించి, ప్రధాన కూడళ్ల వద్ద పేర్చారు. అర్ధ రాత్రి 12 గంటల సమయంలో మంటలు వేసి చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా కామదహనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు కామదహనం చుట్టూ ఆటపాటలతో కేరింతలు కొడుతూ సందడి చేశారు. రంగుల మయమైన అమరవాయి వీధులు మంగళవారం ఉదయం నుంచే గ్రామ వీధుల్లో రంగుల సందడి మొదలైంది. యువత, చిన్న పిల్లలు బృందాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. జిల్లా కేంద్రంలో ప్రముఖులు శుభాకాంక్షలు మల్దకల్ మండలంతో పాటు జిల్లా కేంద్రమైన గద్వాలలో కూడా సంబరాలు మిన్నంటాయి. పట్టణంలోని పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు, ఉన్నతాధికారులు ప్రజలతో కలిసి హోలీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ''ప్రజలందరి జీవితాలు ఈ రంగుల పండుగలాగే ఎప్పుడూ ఆనందోత్సవాలతో నిండి ఉండాలని'' ఆకాంక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం కూడా తగిన జాగ్రత్తలు తీసుకుంది.

ప్రజాపక్షం/మక్తల్ : వసంతకాలంలో ఫాల్గుణ నాడు ప్రకృతిలో కొత్త చిగుళ్లతోపాటు, ప్రజలు ఒకరిపై ఒకరు రంగులు, రంగు నీళ్లు చల్లుకుంటూ జరుపుకునే ఉత్సాహభరితమైన వేడుకే వసంత కేళి రంగుల హోలీ చెడుపై మంచి సాధించిన విజయానికి (హోలీకా దహన్) చిహ్నంగా, ప్రేమ, ఐక్యతను పెంపొందిస్తూ ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. వసంత రుతువు ప్రారంభంలో, సాధారణంగా మార్చి నెలలో (ఫాల్గుణ మాసం) ఈ పండుగ వస్తుంది. హోలీకి ముందు రోజు రాత్రి, చెడును దహనం చేయడాన్ని సూచిస్తూ హోలికా మంటలను వెలిగిస్తారు.

ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. రంగులకేళి మరుసటి రోజు ప్రజలు రంగురంగుల గులాల్‌ను ఒకరిపై ఒకరు చల్లుకుని, డ్యాన్స్‌లు చేస్తూ, రంగునీళ్లతో ఆడుకుంటారు. ఈ సంస్కృతిలో భాగంగానే మక్తల్ పట్టణంలోని సూగేశ్వర కాలనీలో మంగళవారం చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలతో ఆనందంగా హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ రంగుల పండుగ, పాతగొడవలను మర్చిపోయి, ప్రేమతో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి, వసంత సౌందర్యాన్ని ఆస్వాదించడానికి ఒక సువర్ణావకాశంగా భావిస్తూ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# పేదవాడి గుండెల్లో 'కేసర్' భారం

### ఇందిరమ్మ ఇంటికలపై అదనపు వసూళ్ల పిడుగు !



ప్రజాపక్షం/గద్వాల్ : ఒకప్పుడు సొంతింటి కల అంటే ఆనందం.. కానీ ఇప్పుడు గద్వాల జిల్లాలో ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడమంటేనే లబ్ధిదారులు వణికిపోతున్నారు. జిల్లాలో కొనసాగుతున్న నాలుగు కేసర్ మిషన్ల నిర్వాహకులు చేస్తున్న ధరల దందా పేదవాడి నడ్డి విరుస్తోంది. నిన్నమొన్నటి వరకు రూ. 2400 నుండి రూ. 2700 మధ్య ఉన్న ట్రిప్పు ధరను, ఒక్కసారిగా రూ.1100 పెంచి, సామాన్యుడి గుండెల్లో నిప్పులు పోస్తున్నారు.

**అడ్డగోలు దోపిడీ.. పట్టించుకోని అధికార యంత్రాంగం!**

గతంలో ఉన్న ధరలకే ఇల్లు కట్టుకోవడం భారంగా ఉన్న తరుణంలో, ఇప్పుడు ఏకంగా ట్రిప్పుకు వెయ్యి రూపాయలకు పైగా పెంచడం వెనుక ఆంతర్యమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కూలీనాలి చేసుకునే పేదలే అని తెలిసి కూడా, ఈ నాలుగు మిషన్ల యజమానులు ఏకపక్షంగా రేట్లు పెంచడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పాత ధరవ రూ. 24002700, ప్రస్తుత అదనపు భారం రూ. 1100 (మొత్తం రూ. 3800 దాటుతోంది)

**లబ్ధిదారుల ఆవేదన :**

పది ట్రిప్పులు వేయించుకోవాలంటే అదనంగా రూ. 11,000 భారం పడుతోంది.

జిల్లా వ్యాప్తంగా కేవలం నాలుగు మిషన్లే నడుస్తుండటాన్ని ఆసరాగా చేసుకుని, గుత్తాదిపత్యం చలాయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అధికారులు కళ్లున్నా చూడని కబోదుల్లా వ్యవహరిస్తుండటంతో, నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం ఇచ్చే అరకొర నిధులు ఈ మిషన్ల అద్దెలు కట్టడానికే సరిపోతుంటే, ఇక ఇల్లు ఎలా పూర్తి చేయాలనీ లబ్ధిదారులు కన్నీరు మున్నీరవుతున్నారు. ''మా కడుపు కొట్టి మీ జేబులు నింపుకుంటారా?'' అంటూ గ్రామాల నుంచి పేద ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ అడ్డగోలు వసూళ్లను అరికట్టాలి. పెంచిన రూ. 1100 భారాన్ని తక్షణమే తగ్గించి, పాత ధరలకే కేసర్ మిషన్లు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని గద్వాల జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడికి సైతం వెనకాడబోమని హెచ్చరిస్తున్నారు.

### అక్రమ నిర్మాణాల జోలికి వెళ్లని అధికారులు

## చిరువ్యాపారులకు నోటీసులా?

ప్రజాపక్షం/వీపనగండ్ల : వీపనగండ్ల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 721 ప్రభుత్వ భూమి అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. శాశ్వతంగా నిర్మించుకున్న కొందరు ప్రభావశీలుల నివాసాలపై చర్యలు కనిపించకపోతే బతుకుదెరువు కోసం తాత్కాలికంగా డబ్బాలు ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారస్తులకు మాత్రమే నోటీసులు జారీ చేసి ఫోటోలు తీయటం తహసీల్దార్ అధికారులకు ఎంతవరకు సమంజసం అని చిరు వ్యాపారస్తులు ప్రశ్నస్తున్నారు. తమ జీవనోపాధి కోసం తాత్కాలికంగా వేసుకున్న డబ్బాలను ఎప్పుడైనా తొలగించవచ్చని అయితే ప్రభుత్వ భూమిలో శాశ్వత నిర్మాణాల చేపట్టిన వారిపై ముందుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొలన్నారు.

శాశ్వత నిర్మాణాలు ప్రభుత్వ భూమి పరిరక్షణకు పెద్ద సవాలుగా మారుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. ఇంకా, తాము, ఆక్రమణదారులుగా వ్యవహరించలేదని 2016 సంత్సరంలో అప్పటి తహసీల్దార్ ప్రభాకర్ రావు అనుమతితోనే జీవనోపాధి కోసం తాత్కాలిక డబ్బాలు ఏర్పాటు చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు కూడా బాగా తెలుసునని వారు తెలిపారు. అలాంటప్పుడు చిన్న వ్యాపారస్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని నోటీసులు జారీ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడం అధికారుల బాధ్యతేనని, అయితే చర్యలు తీసుకోవడంలో సమానత్వం పాటించాలని శాశ్వత అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై ముందుగా కఠిన చర్యలు తీసుకోవాలని చిరు వ్యాపారస్తులు డిమాండ్ చేస్తున్నారు.

